'గణపతిలాంటి బిడ్డనివ్వాలా?' అని రెట్టించి అడిగింది. 'కాదు.. గణపతినే' స్పష్టంగా చెప్పాడు ఆకాశరాజు. 'తన ముద్దుల బిడ్డను అడుగుతాడేమిటి?' అని విసుక్కోలేదు ఆ తల్లి. 'తథాస్తు' అంటూ వరమిచ్చింది. సాక్షాత్తు బాల గణపతే అతని ఇంట తుండీర యువరాజుగా జన్మించాడు. ఆ తల్లికి హద్దులు తెలియవు. పరిమితులు ఉండవు. కాబట్టే, లోకనాయకి అయ్యింది. కామాక్షి పర దేవత పుణ్యాన కాంచీపురంలో పంటలకు కొదవ ఉండేది కాదట. దీంతో రాజు నిత్యాన్నదానం చేసేవాడట. ఓరోజు రాజుగారి భార్య భోజనం వండుతుండగా.. ఆమె చేతి బంగారు ఉంగరం.. పాయసంలో పడిపోయింది. ఆ పాయసాన్ని ఓ ముత్తయిదువ రూపంలో భోజనానికి వచ్చిన కామాక్షికి వడ్డించారు. ఆమె ఇష్టంగా ఆరగించారు. పాయసంతోపాటు బంగారమూ కడుపులోకి వెళ్లిపోయింది. బంగారాన్ని వడ్డించిన రాజుకు.. బంగారాన్నే కానుకగా ఇవ్వాలనే ఉద్దేశంతో కనక వృష్టి కురిపించిందట ఆ తల్లి.

**సమన్వయ మూర్తి..**

ఓ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాలంటే.. కొన్నిసార్లు ఒక వ్యక్తి సరిపోకపోవచ్చు. ఒక్కరి శక్తి చాలకపోవచ్చు. నాలుగు ఆలోచనలు కలవాలి. మేధోమథనమంటూ జరగాలి. సామూహిక కృషి మొదలుపెట్టాలి. ఈ మహత్కార్యానికి ఎవరో ఒకరు పూనుకోవాలి. అనుచరులలో, సహచరులలో ఉత్సాహం నింపాలి. వ్యూహం సిద్ధం చేయాలి. ఆచరణ మొదలుపెట్టాలి. సమర్థతను బట్టి విధులు కేటాయించాలి. అధికార బదిలీ చేయాలి. ఒక్క మాటలో చెప్పాలంటే.. నాయకత్వ స్థానంలో ఉన్నవారే కర్త, కర్మ, క్రియ. అమ్మవారి సమర్థ నాయకత్వంలో జరిగిన త్రిపురాంతక సంహారం.. సమష్టి విజయానికి, నాయకత్వ బలానికి, పదునైన వ్యూహ రచనకు నిలువెత్తు తార్కాణం. కాబట్టే, ముగురమ్మల మూలపుటమ్మ.. చాలా పెద్దమ్మ.. త్రిపురాంతకిగా జగత్ ప్రసిద్ధురాలైంది. ఇదొక మహాద్భుత ఘట్టం. తారకాసురుడికి ముగ్గురు కొడుకులు. తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి. ముగ్గురూ బ్రహ్మను ఉద్దేశించి తపస్సు చేశారు. అజరామరత్వాన్ని ప్రసాదించమని అడిగారు. కుదరదు పొమ్మన్నాడు విధాత. ముగ్గురికీ మూడు లోకాలనైనా సృష్టించి ఇవ్వమని వేడుకున్నారు. ఈ సారి తప్పలేదు. బంగారు, వెండి, ఇనుము నగరాలను సిద్ధం చేయమని మయుడిని ఆదేశించాడు బ్రహ్మ. తక్షణం శత్రుదుర్భేద్యంగా కట్టి ఇచ్చాడు దేవశిల్పి. కానీ రాక్షసులు అసుర ప్రవృత్తికొద్దీ.. మహర్షులను హింసించేవారు. దైవ దూషణ చేసేవారు. దీంతో జగన్మాత త్రిపురాసుర సంహారానికి వ్యూహం పన్నింది. ఆ మూడు నగరాలూ ఒకే కక్ష్యలో వచ్చే సమయాన్ని ముహూర్తంగా నిర్ణయించింది. శివుడికి సంహార బాధ్యత అప్పగించింది. భూమిని రథంగా మార్చింది. సూర్య చంద్రులను చక్రాలను చేసింది. నాలుగు వేదాలను గుర్రాలుగా ప్రసాదించింది. మేరు పర్వతాన్ని ధనుస్సుగా సిద్ధం చేసింది. విష్ణువును అస్త్రం చేసింది. మూడు నగరాలూ ఒకే వరుసలో రావడమే ఆలస్యం.. 'శివా గురిపెట్టు' అని ఆదేశించింది. రెప్పపాటు సమయంలో శత్రు సంహారం పూర్తయింది. ఇంతటి సమన్వయ శక్తి.. శ్రీశక్తి నాయకత్వానికే సాధ్యం. త్రిపురాలు ఎక్కడో లేవని.. మన అజ్ఞాన, అహంకార, దుర్గుణాలే అంటారు పండితులు. అమ్మ తనదైన యోగ బలంతో ఆ అసురగుణాల్ని తుత్తునియలు చేస్తుందనేది ఆధ్యాత్మిక కోణం. ఆగమశాస్త్ర ప్రకారం కూడా.. త్రిపుర సంహారమూర్తి అయిన శివుడి విగ్రహానికి ఎడమ భాగంలో మహాదేవి ఉండాల్సిందే. అప్పుడే, ఆ శిల్పానికి పరిపూర్ణత.

## జ్ఞానప్రసూన..

నాయకత్వ బలమే జ్ఞానం. నాయకులు నిత్య విద్యార్థులు. జగద్ధాత్రి కూడా నిరంతర సాధకురాలే. కాబట్టే, బుద్ధిగా దక్షిణామూర్తి ముందు కూర్చుని గురుగీత విన్నది. సందేహాలు నివృత్తి చేసుకున్నది. సకల విద్యలకు అధిదేవత అయినా.. కించిత్ కూడా అహంభావం లేదు. ఓసారి బ్రహ్మ మానస పుత్రులైన సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాతులు.. కైలాసానికి వెళ్లారు. ఆ సమయానికి పార్వతీదేవి పర్ణశాలలో తపస్సు చేసుకుంటున్నది. తల్లి పాదాలకు నమస్కరించి తమ సందేహాన్ని వ్యక్తపరిచారు. వేదాల సారాన్ని తెలిపి.. తమకు జ్ఞానభిక్షను ప్రసాదించమని వేడుకున్నారు. శైలపుత్రి చిరునవ్వు నవ్వి.. పరమశివుడి వైపు చూసింది. కళ్లతోనే పెనిమిటివైపు జ్ఞానధారను ప్రవహింపజేసింది. శివుడు దక్షిణామూర్తిగా రుషిపుంగవులకు మహాజ్ఞానాన్ని ప్రసాదించాడు. దక్షిణామూర్తి అవతారాలు అనేకం. మేధా దక్షిణామూర్తి, యోగ దక్షిణామూర్తి, జ్ఞాన దక్షిణామూర్తి మాత్రమే కాదు, అంతిమంగా శాంభవీ దక్షిణామూర్తీ అయ్యాడు. అందుకే స్వామి పదం అయితే.. ఆమె అర్థం అయ్యింది. కాబట్టే ఆదిశంకరులు అమ్మవారిని 'దక్షిణామూర్తి రూపిణి' అంటారు.



**అర్ధ పురుషేశ్వరి..**

మనం అర్ధనారీశ్వర తత్వాన్ని సగం కూడా అర్థం చేసుకోలేకపోతున్నాం. స్థూలంగా చూస్తే.. అతనిలో ఆమె సగం కాదు, ఆమెలోనే అతను సగం. అమ్మలోనే అయ్య ఉన్నాడు. అయ్యలో అమ్మ లేదు. ఈ ఘట్టానికి మూలాలు భృంగి వృత్తాంతంలో ఉన్నాయి. ప్రమథగణ ముఖ్యుడైన భృంగి పరమేశ్వరుడి భక్తుడు. స్త్రీ అనే తేలిక భావమో, మరో కారణమో తెలియదు కానీ.. అమ్మవారంటే కాస్త చిన్నచూపు. అమ్మవారి ఉనికిని విస్మరించి శివుడికి మాత్రమే ప్రదక్షిణ నమస్కారాలు సమర్పించాడు. అమ్మ మనసు చివుక్కుమంది. అయినా, మౌనంగానే ఉండిపోయింది. ఆ తర్వాత మరోసారి.. అదే ఘట్టం పునరావృతం అయ్యేది. ఉద్దేశపూర్వకంగానే అమ్మవారు శివుడికి అతిదగ్గరగా కూర్చున్నారు. శివుడి చుట్టూ ప్రదక్షిణ చేయలేని పరిస్థితి. దీంతో భ్రమరంగా మారిపోయి.. శివుడి చుట్టూ తిరిగాడు. దీంతో అమ్మవారి ఆవేశం హద్దులు దాటింది. ఆ భ్రమరం కాళ్లు పీకేసింది. ఎంతైనా భక్త వత్సలుడు కదా! భృంగి బాధపడుతుంటే చూస్తూ కూర్చుంటాడా శివదేవుడు. మూడో కాలు ప్రసాదించాడు. దీంతో అమ్మవారికి పంతం పెరిగింది. నిజానికి ఇక్కడ భృంగి పురుషాహంకారం ఒక సాకు మాత్రమే.. ఆలుమగల మధ్య అభేదాన్ని చూడలేని మూర్ఖులకు ఓ సందేశాన్ని ఇవ్వాలనుకున్నారు ఆ తల్లి. ఘోర తపస్సు చేసి.. శివుడిని ప్రసన్నం చేసుకున్నారు. అర్ధనారీశ్వరతత్వాన్ని ఆమోదించేలా చేశారు. ఆ హోదా.. అయాచితం కాదు. ఆమె పోరాడి సాధించుకున్నది. మహిళలోని పట్టుదలకు ఇదొక తార్కాణం. ఆధునిక మహిళకు ఇదొక స్ఫూర్తిదాయక ఘట్టం. ఆకాశంలో సగం తనదేనంటూ మురిసిపోతే సరిపోదు. పోరాడి సాధించుకోవాలి. పుం-స్త్రీ తత్వం ఆదిదంపతులకే పరిమితం కాదు. విష్ణుశక్తి లక్ష్మి, బ్రహ్మశక్తి సరస్వతి, రామశక్తి సీతాదేవి, సూర్యశక్తి ఛాయాదేవి, అగ్నిశక్తి స్వాహాదేవిగానూ మనం ఆమోదించాలి.

**రాజ శ్యామల..**

పాలకులకు పాలకురాలు జగన్మాత. మహామంత్రులకు వ్యూహాలు నేర్పగల యోధ రాజరాజేశ్వరి. లక్షమంది చాణక్యులైనా ఆమె కాలిగోటికి సరిపోరు. అఖండ భూమండల పాలననూ తానే చక్కబెడుతుంది. సమర్థుల పాలనలో సకాల వర్షాలు, ముక్కారు పంటలు ఆ అమ్మ చలువే. రాజధాని నలుదిక్కులా విస్తరించినా, ధనాగారం కాసులతో కళకళలాడుతున్నా.. ఆ చేతి కటాక్షమే. రాజ శ్యామలను ఉపాసించిన ప్రభువుకు తిరుగు ఉండదు. ప్రత్యర్థులు దరిదాపుల్లోకి కూడా రాలేరు. ఆ రాజ్యాన్ని ఆమె.. తల్లి బిడ్డను రక్షించుకున్నట్టు కాపాడుతుంది. శ్రీకృష్ణుడిని పురమాయించి.. పాలకుడి ద్వారా వ్యూహ రచన చేయిస్తుంది. శత్రుభయం ఉండదు. ధనుర్ధారి రాముడిని సరిహద్దులలో కాపలా పెడుతుంది. చొరబాట్లకు తావులేదు. అన్నపూర్ణను పెద్ద ముత్తయిదువగా ఇంటింటికి పంపుతుంది. అన్నానికి కొదవే ఉండదు. దేశంలో ఒక్క తెలంగాణకు మాత్రమే రాజశ్యామల కటాక్షం దక్కింది. అందుకే ఈ అగ్రస్థానం.

* * *

**కాంచీపురంలో ఓ మూగ భక్తుడు అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. అప్పటికే కామాక్షమ్మకు నైవేద్యం సమర్పించారు. ఆలయ ద్వారాలు మూసేశారు. దీంతో అతను నిరాశపడ్డాడు. మనసారా నైవేద్యం ఆరగించిన ఆ తల్లి.. తాంబూల చర్వణం చేస్తూ వీధిలోకి వచ్చింది. ఆ మూగ భక్తుడి తపనను అర్థం చేసుకుంది. తాను నములుతున్న తాంబూలం కాస్తం తీసి.. ఆ మూగవాడి నోట్లో పెట్టింది. అమ్మ ఎంగిలి.. వేయి అమృతభాండాలకు సమానం! తాదాత్మ్యంతో చప్పరించాడు. నోరు పండింది. జీవితమూ పండింది. మాట వచ్చింది. కవిత్వం ప్రవహించింది. ఆశువుగా ఐదు వందల శ్లోకాలు చెప్పాడు. పరమేశ్వరి పరవశించింది. 'ఏం వరం కావాలో కోరుకో బిడ్డా' అని అడిగింది. 'నన్ను మళ్లీ మూగవాడిగా మార్చు తల్లీ' అని వేడుకున్నాడు. 'నిన్ను కీర్తించిన ఈ నోటితో ఏం మాట్లాడినా తప్పే. నీ ఎంగిలితో పవిత్రమైన ఈ నోటితో నీ ప్రసాదం కాని ఏ పదార్థం తిన్నా అపరాధమే కదా' అంటూ తన మనసులో మాట చెప్పాడు. మూకాంబిక ఆ భక్తుడికి ముక్తిని ప్రసాదించింది. మాటలోని అర్థాన్నే కాదు, మౌనంలోని అంతరార్థాన్నీ గ్రహించగలదు ఆ జగన్నాయకి. ప్రపంచానికి కావలసింది.. ఆ నవదుర్గ నాయకత్వమే!** ■